క్లుప్తంగా

గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఎన్నికలు సోమవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించా రు. అధ్యక్షుడిగా రాములు, కార్యదర్శిగా శివకుమార్‌లు ఎన్నికయ్యారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ డాక్టర్‌గా సృజన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో కొంతకాలంగా రెండు డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ఎల్లారెడ్డి మండలం మత్తమాల డాక్టర్ శరత్‌కు నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ డాక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వారంలో మూడు రోజులపాటు నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు డాక్టర్ శరత్‌ను ఆదేశించారు. సోమ, మంగళ, బుధ వారాలు ఆయన నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలందించారు. కాగా మాచారెడ్డి పీహెచ్‌సీలో సెకండ్ మెడికల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న డాక్టర్ సృజన్‌ను డిప్యూటేషన్‌పై నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి పంపించారు.

ఆర్థిక సాయం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం బాధిత కుటుంబానికి చిన్ననాటి మిత్రులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన లాలమ్మల సంతోష్ ఈ నెల 19న పోలీసు స్టేషన్ ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య యత్నం చేయగా గాయాలతో బాధపడుతున్న సంతోష్‌ను చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో చిన్ననాటి మిత్రులు రూ.22 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

విద్యార్థులకు అభినందన

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల మహారాష్ట్రలో జరిగిన రంగోత్సవ పోటీల్లో ప్రతిభ కనబర్చగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిని జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ అభినందించారు. ఎంపీడీవో చిన్నారెడ్డి, సర్పంచ్ నల్లపు అంజలి, మండల కోఆప్షన్ సభ్యులు షమ్మీ, ఎంపీవో తిరుపతిరెడ్డి ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను నిలిపేయాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని బీడీ కాలనీలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, పేశెట్టి రవి, అఫీజ్ విన్నవించారు.

మహిళల ఆరోగ్యంపై దృష్టి

మద్నూర్(జుక్కల్): మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆరోగ్య బోధకుడు దస్తీరాం పేర్కొన్నారు. పెద్ద శక్కర్గాలో సోమవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది రకాల అనారోగ్య సమస్యలకు ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సాయం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం లక్ష్మి, సంగీత పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని సీఐ రామన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతా నియమాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాప్రదర్శన ద్వారా ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరు, హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను కళ్లకు కట్టినట్లు వివరించారు.

ఉపాధి పనులపై అవగాహన

నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ .. వేసవిలో కూలీల సంఖ్య పెంచాలన్నారు.

మత విద్వేషాలకు కుట్ర



బాన్సువాడ రూరల్: ఎంతో సఖ్యతతో మెలుగుతున్న హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా ఆరోపించారు. ముస్లింలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను రద్దుచేస్తామంటూ కేంద్రంలో హోం మంత్రిగా ఉన్న అమిత్‌షా ప్రకటించడం దీనికి నిదర్శనమన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

భిక్కనూరు : మైనార్టీ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తామని వ్యాఖ్యలు చేయడంతో కాచాపూర్‌లో సోమవారం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామానికి చెందిన మైనార్టీలు ఆందోళనలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నిర్మాణాలు

- మద్దెల్‌చెరువులో నీటి మధ్యలో వైకుంఠధామం
- కందర్‌పల్లిలో ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..
- వృథా అవుతున్న ప్రజాధనం



నీటి మధ్యలో ఉన్న పిట్లం మండలం మద్దెల్‌చెరువు వైకుంఠధామం

బిచ్కుంద(జుక్కల్): అంతిమ దహన సంస్కారాలు జరిగే చోట అన్ని వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని గ్రామాలలో రూ.లక్షల నిధులు వెచ్చించి వైకుంఠధామాలు నిర్మించింది. కానీ ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ 12.60 లక్షల నిధులతో వైకుంఠధామాలు నిర్మించారు. అంత్యక్రియలకు వచ్చిన బంధు మిత్రులకు కోసం వైకుంఠధామాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాంట్రాక్టర్లు లాభం పొందారు కాని వైకుంఠధామాల్లో సరైన వసతులు కల్పించకపోవడంతో చాలా చోట్ల నేటి వరకు వాడకంలో రాలేదు. దీంతో ప్రజాధనం వృథా అయింది. ప్రభుత్వం ప్రతి గ్రామంలో తప్పకుండా వైకుంఠధామాలు నిర్మించాలని ఆదేశించడంతో కొన్ని గ్రామాల్లో గుట్టల వద్ద దూరంగా నిర్మించి చేతులు దులుపుకున్నారు. నాసిరకం పనులు చేసి వదిలేశారు. నాణ్యమైన రేకులు కూడా వేయలేదు. దీంతో చిన్నపాటి గాలులకే రేకులు ఊడిపోతున్నాయి. గోడలకు పగుళ్లు ఏర్పడి ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి ఆలనా పాలనా పంచాయతీ అధికారులకు అప్పగించారు. నిధులు లేక వారు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కొన్ని గ్రామాలలో కిలోమీటర్ల దూరంలో నిర్మించడం.. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో దహన సంస్కారాలు జరగడం లేదు. వాటి గురించి అడిగే నాథుడే లేడు.

అవస్థల నడుమ దహన సంస్కారాలు

వైకుంఠధామాలలో వసతులు కల్పించకపోవడంతో నేల మీదనే ఎక్కడపడితే అక్కడ గుట్టలలో దహన సంస్కారాలు చేస్తున్నారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలలో వైకుంఠధామాలు నిర్మించారు. కొన్ని గ్రామాలలో వసతులు లేక నేటికీ వాడకంలో రావడం లేదు. పిట్లం మండలం మద్దెల్‌చెరువులో మంజీరా లోతట్టు ప్రాంతంలో వైకుంఠధామం నిర్మించారు. కొద్దిపాటి వర్షం కురిసినా మోకాళ్ల వరకు నీరు నిలువ ఉంటున్నాయి. మద్నూర్ మండలం ఎస్‌బురలో ఇదే పరిస్థితి నెలకొంది. బిచ్కుంద మండలంలోని శాంతాపూర్, ఎల్లారం, కందర్‌పల్లి, పుల్కల్, మద్నూర్ మండలంలోని సిర్‌పూర్, ఎస్‌బుర, గోజేగాం, పిట్లం మండలం రాంపూర్, బ్రాహ్మణపల్లి, మద్దెల్‌చెరు, పెద్దకొడప్‌గల్ మండలంలో అంజని, తిమ్మరాంతండా, చిన్న దేవిసింగ్ తండా, బూరుగుపల్లి, సముందర్‌తండా, బేగంపూర్, కాస్లాబాద్ గ్రామాలలోని వైకుంఠధామాలకు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, సరైన రోడ్లు లేవు. కొన్ని గ్రామాలలో పీవీసీ ట్యాంకులు బిగించి వాటర్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాల్లో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖ్యమంత్రికి లేఖల ద్వారా విజ్ఞప్తి

తమను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉత్తరాలు పోస్టు చేశారు. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సంఘం నేతలు మాట్లాడుతూ..కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జేపీఎస్‌ల ప్రొబేషన్ కాలం గడువు పూర్తయినా ఇంకా క్రమబద్ధీకరించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడే వరకు ఆందోళనలు చేస్తామని వ్యాఖ్యానించారు.

–సాక్షి నెట్‌వర్క్


మద్నూర్‌లో లేఖలను పోస్టు చేస్తున్న జేపీఎస్‌లు


బిచ్కుందలో పోస్టు కార్డులతో జేపీఎస్‌లు


తాడ్వాయిలో..


నిజాంసాగర్‌లో..

నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరాలి


దోమకొండలో మాట్లాడుతున్న బీజేపీ నేత రాజేష్


మాచారెడ్డిలో.. బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్

కామారెడ్డి టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని అసెంబ్లీ ఇన్‌చార్జి కుంట లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో పట్టణ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని, ఈ 6 నెలల కాలంలో ప్రతి కార్యకర్త పార్టీ కోసం సమయాన్ని కేటాయించాలన్నారు. మైనారిటీ మోర్చా జిల్లా నాయకులు అఫీజ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు విపుల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే..

మాచారెడ్డి(కామారెడ్డి): వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన మాచారెడ్డి మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దొందూ దొందేనని, ప్రజలు వారిని నమ్మి మోసపోవద్దన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నరసింహచారి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల భారత్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

దోమకొండ: రాబోయే ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

భిక్కనూరులో కార్యకర్తల సమావేశం

భిక్కనూరు: భిక్కనూరు మండల కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలోని పాకనాటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ తేలు శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు బక్కి సంధ్య, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్‌లు హాజరై మాట్లాడారు.

వీవోఏల సమస్యల్ని పరిష్కరించండి


మద్నూర్‌లో సమ్మె చేస్తున్న వీవోఏలు


ఎమ్మెల్యే జాజాలకు వినతిపత్రమిస్తున్న వీవోఏలు

మద్నూర్(జుక్కల్): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఐకేపీ వీవోఏలు కోరారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో సోమవారం వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్నామన్నారు. వీవోఏల సంఘం అధ్యక్షుడు చారి పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ గ్రామ సంఘాల వీవోఏలు సోమవారం నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

సంఘాలు మరింత అభివృద్ధి చెందేలా చూడాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో అర్హతున్న సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ అన్నారు. తాడ్వాయి ఐకేపి కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజ్ వీర్, డీపీఎం వకులా, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక చేయూత



కామారెడ్డి క్రైం: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మందికి మంజూరైన రూ.15.56 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కామారెడ్డిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. ఏవైనా ప్రమాదాలు, అనారోగ్యాల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్న నిరుపేదలకు ఈ పథకం ద్వారా సహాయం అందిస్తామన్నారు.

అనారోగ్యంతో ఆర్టీసీ కండక్టర్ మృతి

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలం మొగాకి చెందిన ఆర్టీసీ బస్ కండక్టర్ ఎస్.రాజు(45) సోమ వారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కామారెడ్డి ఆర్టీసీ డిపోలో రాజు కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని వారు పేర్కొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని మౌంట్ కార్మెల్ స్కూల్ వార్షికోత్సవం సోమవారం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు వీక్షకులను అలరించాయి.

డబుల్ ఇళ్ల కోసం ర్యాలీ



రామారెడ్డి: పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో పేదలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. పేదలకు ఇళ్ల కేటాయింపు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


దోమకొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి


తిమ్మనగర్‌లో .. డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి

దోమకొండ: దోమకొండ మండల కేంద్రంతో పాటు అంచనూరు, సంఘమేశ్వర్ గ్రామాల్లో, బీబీపేట మండలంలోని మాందాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను దోమకొండ సింగిల్ విండ్ చైర్మన్ పన్యాల నాగరాజ్ రెడ్డి ప్రారంభించారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పిట్లం(జుక్కల్): తిమ్మనగర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సహకార సంఘం చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు విజయ్, మండల రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎంపీపీ అశోక్ పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బాలు పాల్గొన్నారు.

రాజంపేట: ఆర్గొండ సొసైటీ పరిధిలో గుండారం, కొండాపూర్, సిద్దాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ కంది శివరాములు ప్రారంభించారు. ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, సదాశివనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లం సాయిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి(కామారెడ్డి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏడీఏ అపర్ణ, జెడ్పీటీసీ మినుకూరి రామ్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఫూల్‌చంద్ నాయక్, తదితరులు ఉన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పిట్లం/లింగంపేట/నిజాంసాగర్/మద్నూర్ : విద్యార్థులు వేసవి సెలవుల్లో జాగ్రత్తలు పాటించాలని ఉపాధ్యాయులు సూచించారు. పాఠశాలలకు 2023 సంవత్సరం ఏప్రిల్ 24 చివరి పనిదినం కావడంతో కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. విద్యార్థులు పైతరగతికి వెళ్తున్నందున వారిని అభినందించారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున బయట ఆడుకోవడం తగ్గించాలన్నారు. కేవలం ఇండోర్ గేమ్స్ ఆడుకోవాలన్నారు. చెరువుల్లో ఈతకు వెళ్లవద్దన్నారు. నెల పదిహేను రోజులు తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిట్లం మండలం గౌరారం, మద్నూర్ మండలం పోచమ్మ గల్లీ, లింగంపేట మండలం శెట్పల్లి సంగా రెడ్డి, నిజాంసాగర్ మండలం గాలీపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.


గౌరారం ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశమైన ఉపాధ్యాయులు

సమాచారం..

■ నేడు ఉచిత నేత్ర పరీక్షలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో విశ్రాంత ఉద్యోగుల కోసం మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మెడివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విఠల్‌రావు, గంగాగౌడ్‌లు తెలిపారు.

■ బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో మంగళవారం బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జలంధర్‌రెడ్డిలు సోమవారం తెలిపారు. పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

■ 26న సర్వసభ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ తెలిపారు. సమావేశానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

■ 28 నుంచి క్రికెట్ పోటీలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లో ఈనెల 28నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గం స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. గెలిచిన జట్టుకు రూ.30వేలు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20వేల చొప్పున ఇవ్వనున్నామని, ఆసక్తి గల వారు రూ.వేయి చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 7032219045, 7569999071, 6304212972.

సంక్షిప్తం

మజ్జిగ కేంద్రం ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో భూమి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ, చలి వేంద్రంను సోమవారం తహసీల్దార్ భరత్ కుమార్ ప్రారంభించారు. భూమి ఫౌండేషన్ అధ్యక్షుడు బస్వరాజ్, సభ్యులు బాలాజీ, నిసార్ పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం అంబలి కేంద్రం ఏర్పాటు

మాచారెడ్డి(కామారెడ్డి): రెండేళ్ల కిందట కరోనా బారిన పడి మృతి చెందిన తండ్రి జ్ఞాపకార్థం తనయులు సోమవారం గజ్యా నాయక్ తండా చౌరస్తాలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రానికి చెందిన నూతికాడి శంకర్ కరోనాతో మృతి చెందారు. అప్పటి నుంచి ఆయన తనయులు సంతోష్, బద్రిలు వేసవిలో అంబలి కేంద్రంతో పాటు పలు సేవాకార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

నిజాంసాగర్ చౌరస్తా సమీపంలో..

కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి ఆరాధన ఉత్సవాల సందర్భంగా సోమవారం కామారెడ్డి నిజాంసాగర్ చౌరస్తా సమీపంలోని సాయి చలివేంద్రంలో 450 మందికి మజ్జిగ, అంబలి, 64 మంది పేదలకు నారాయణ సేవ సరుకుల ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ప్లీనరీని విజయవంతం చేయండి

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీని మండల కేంద్రంలోని బండాయప్ప ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు, నాయకులు అందరు హాజరై విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు దేశాయి తెలిపారు. ఎంపీపీ అశోక్ పటేల్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయ అభివృద్ధికి విరాళం

భిక్కనూరు: తిప్పాపూర్‌లోని అతి పురాతనమైన శ్రీ లక్ష్మి వేంకటేశ్వరాలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన అంగన్‌వాడి టీచర్ సుచరిత రూ.11 వేలను సోమవారం విరాళంగా అందజేశారు. ఆలయ పాలక మండలి చైర్మన్ తాటిపల్లి సిద్ధరాములు, సర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ల గుర్తింపు సులభం

ఎల్లారెడ్డి: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లు పోగొట్టుకున్న వాటిని గుర్తించడం సులభతరమవుతుందని ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్న వారికి వారి ఫోన్లను పట్టుకుని అప్పగించారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీర్కూర్‌లో పంచాయతీరాజ్ దినోత్సవం

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రఘు, ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతి రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తోట రాజేశ్ సూచించారు. పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రత వల్ల ఈత కోసం చెరువులు, బావుల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సెలవులు పూర్తయ్యే వరకు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

సదాశవనగర్(ఎల్లారెడ్డి): అమర్లబండ, జనగాం గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గీతకార్మికులకు వృత్తి నైపుణ్య పరీక్ష

బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపులోని ఈతవనంలో సోమవారం బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరి రెడ్డి పలువురు గీతకార్మికులకు వృత్తినైపుణ్య పరీక్ష నిర్వహించారు. ఈత చెట్టు ఎక్కే విధానం, చెట్టుకు కల్లుగీసే పరీక్షలు నిర్వహించారు. నైపుణ్యం కల గీతకార్మికులకు లైసెన్సులు జారీ చేస్తామన్నారు.

బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణకు తరలి రావాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో మంగళవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉందని ప్రతి కార్యకర్త, నాయకుడు పాల్గొనాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోను పార్టీ జెండాను ఆవిష్కరించాలని అనంతరం బాన్సువాడ పట్టణంలో పార్టి ప్లీనరీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పోచారం సురెందర్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఘనంగా మడివేల మాచయ్య కల్యాణం

భిక్కనూరు: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో మడివేల మాచయ్య(మడేల్లయ్య) కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మడేలయ్య కల్యాణాన్ని సీతాలమ్మతో వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం, కట్నకానుకలు సమర్పించుకున్నారు.

ప్రొఫెసర్ మృతి తీరని లోటు

ఎల్లారెడ్డి/కామారెడ్డి అర్బన్: తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలశ్రీనివాసమూర్తి మృతి సాహితీ లోకానికి తీరని లోటని తెలంగాణ రచయితల వేదిక సభ్యులతో పాటు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అన్నారు. ఆయన మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.